క్లుప్తంగా

కార్పొరేషన్ అధికారులపై కేసు నమోదు

నెల్లూరు సిటీ: కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదనే అంశమై కోర్టు ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులపై దర్గామిట్ట పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసులు సమాచారం మేరకు.. కరోనా సమయంలో సంతపేట మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన షామియానాల అద్దె బిల్లులు చెల్లించలేదంటూ కోర్టును కాంట్రాక్టర్ విజయ్‌కుమార్ ఆశ్రయించారు. అద్దె పెద్ద మొత్తంలో కాగా, సెకండ్ హ్యాండ్‌లో తాను కొనుగోలు చేశానని, అందుకు గానూ రూ.2.18 లక్షలే బిల్లు చెల్లించేలా తప్పుడు పత్రాలను సృష్టించారంటూ బాధితుడు ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాలతో కమిషనర్ వికాస్ మర్మత్, రీజినల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి, సీఆర్డీఏ అదనపు కమిషనర్ అలీమ్‌బాషా, అసిస్టెంట్ ఇంజినీర్ మాధవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పోలీస్‌స్టేషన్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన


పోలీస్ సిబ్బందితో విద్యార్థులు

విడవలూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే వివిధ కార్యకలాపాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్, స్టేషన్ రైటర్, వీహెచ్‌ఎఫ్ సెట్, టెలి కాన్ఫరెన్స్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, వివిధ రకాల బందోబస్తులు, పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ వంటి పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు.

వీఎస్‌యూ అభివృద్ధికి కృషి



వెంకటాచలం : అందరి సహకారంతో విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) అభివృద్ధికి కృషి చేస్తున్నామని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ వంద రోజుల్లో వీఎస్‌యూలోని అన్ని విభాగాలను పరిశీలించడం, అధ్యాపకులు, విద్యార్థులతో అనేక సమావేశం నిర్వహించడం, వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలలను సందర్శించినట్లు వివరించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల సమష్టి సహకారంతో వీఎస్‌యూలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. సమావేశంలో వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్.పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

చేపల గుంతలో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇందుకూరుపేట : ప్రమాదవశాత్తు చేపల గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లేబూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామానికి చెందిన తుళ్లూరు చెంచయ్య (55) కుమారుడు చెంచుకృష్ణ లేబూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కుమారుడి వద్దకు చెంచయ్య వచ్చారు. కొబ్బరిచెట్ల నుంచి రాలిన ఎండు కొబ్బరికాయలను ఏరుకునేందుకు సమీపాన ఉన్న లేబూరు గ్రామానికి వచ్చారు. ఓ రైతుకు సంబంధించిన చేపల గుంతల వద్ద కాయలను ఏరుకునే క్రమంలో గుంతలో పడిపోయారు. ఇంటి వద్ద పనులు ముగించుకుని చేపల చెరువు వద్దకు వచ్చిన రైతుకు గుంతలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై నాగార్జున్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుడు చెంచయ్య అని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఎట్టకేలకు..

- ఎనిమిది నెలల సుదీర్ఘ విరామానంతరం కౌన్సిల్ సమావేశం
- నవంబర్ ఐదున నిర్వహణ..?


కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని ఎప్పుడెప్పుడు నిర్వహిస్తారాననే నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. వాస్తవానికి తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను మేయర్, అధికారులకు తెలియజేసి వాటి పరిష్కారం కోసం కార్పొరేటర్లు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో నవంబర్ ఐదున నిర్వహించనున్నారని సమాచారం.

అంతా జాప్యమే..

నిజానికి కౌన్సిల్ సమావేశాన్ని ఈ ఏడాది మార్చిలో నిర్వహించారు. నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి సమావేశాన్ని జరపాల్సి ఉన్నా, వివిధ కారణాలతో జాప్యం చోటుచేసుకుంది. దాదాపు ఐదు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో కార్పొరేషన్లో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2021లో నిర్వహించిన కార్పొరేషన్ ఎన్నికల్లో నగరంలోని 54 డివిజన్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే కార్పొరేటర్లుగా గెలుపొందారు. అయితే వీరిలో ఎక్కువ మంది టీడీపీలోకి ఫిరాయించారు.

43వ డివిజన్‌కు ఎన్నిక ఎప్పుడో..?

ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ సమయంలో తన పదవితో పాటు 43వ డివిజన్ కార్పొరేటర్ పదవికీ రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఈ డివిజన్‌కు సంబంధించిన ఎన్నికలను నిర్వహించే దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నవంబర్ ఐదున నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశం ఏ విధంగా ఉండబోతోందోనని పలువురు చర్చించుకుంటున్నారు.

కాలువల్లో పూడికతీత పనులు


పూడికతీత పనులను పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ నెల్లూరు సాకారమే లక్ష్యంగా నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుద్ధ్య పనులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, ఇందులో భాగంగా ఇంటింటి చెత్త సేకరణతో పాటు కాలువల్లో పూడికతీత పనులు తదితరాలను రోజూ నిర్వహిస్తున్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. వేదంవారి అగ్రహారం, మిలటరీ కాలనీ, కొండాయపాళెం, రంగనాయకులపేట, బ్రహ్మానందపురం, గాంధీగిరిజన కాలనీ, కపాడిపాళెం, సంతపేట మార్కెట్ ప్రాంతాల్లో కాలువల పూడికతీత పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందజేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలను విధిస్తామని స్పష్టం చేశారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు (టౌన్): బీవీనగర్‌లోని మదర్‌థెరీసా చారిటీ హోమ్‌కు రూ.రెండు లక్షల విలువజేసే బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి - ఎస్సార్కే స్కూల్ విద్యార్థులు శనివారం అందజేశారు. స్కూల్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు సేకరించాలి


కాల్ సెంటర్ నిర్వహణను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పూర్తి వివరాలను సేకరించి ఆన్‌లైన్లో పొందుపర్చాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కాల్ సెంటర్ నిర్వహణను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించాలని సూచించారు. లబ్ధిదారులను ఫోన్ ద్వారా సంప్రదించి పూర్తి వివరాలను సేకరించాలని కోరారు. టీపీఆర్వో బాలకృష్ణ పాల్గొన్నారు.

విజయ డెయిరీకి సహకరించరూ..



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని విజయ డెయిరీకి సహకారం అందించాలని చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలో కృష్ణా మిల్క్ యూనియన్, విజయ డెయిరీ చైర్మన్ ఆంజనేయులును శనివారం కలిశారు. పరస్పర సహకారం అందించుకుందామని కోరారు. ఇక్కడికి వచ్చే అదనపు పాలను విజయవాడలోని విజయ డెయిరీకి ఇచ్చేలా సహకరించాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు(సెంట్రల్): కోవూరు నియోజకవర్గ పరిధిలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పంపిణీ చేశారు. నగరంలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆరుగురికి చెక్కులను అందజేశారు. అదే విధంగా కోవూరుకు చెందిన టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో రూ.ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

జిల్లాకు మంత్రి ఆనం రాక నేడు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరుకు ఆదివారం రానున్నారు. అనంతసాగరం మండల కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికకు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు.

యోగాతో ఆరోగ్యం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆరోగ్యానికి యోగా మంచిదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు యోగా తరగతులను యోగా మాస్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో యోగా తరగతులను నిర్వహించాలనే అంశాన్ని ప్రభుత్వానికి తెలియజేయనున్నామన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న బాలికలకు యోగా తరగతులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎమ్సీఏ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ పొగతోట, కాంప్లెక్స్ రోడ్డు ఫీడర్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశేఖరపురం, కాంప్లెక్స్ రోడ్డు, పొగతోట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

డ్రోన్లతో దోమల మందు పిచికారీ



నెల్లూరు(బారకాసు): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నగరంలో పారిశుధ్య పనులు చేస్తున్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో పారిశుధ్య కార్మికులు చేరలేని ప్రదేశాల్లో డ్రోన్ల సాయంతో చేపట్టిన దోమల నివారణ మందు పిచికారీ, ఫాగింగ్ పనులను శనివారం పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇరుకు వీధులు, ముళ్ల పొదలు, మురుగు స్థలాలు తదితర ప్రాంతాలకు కార్మికులు చేరుకోలేరని, ఇక్కడ ఫాగింగ్, దోమల నివారణ మందు పిచికారీకి డ్రోన్లను వినియోగిస్తున్నామని వివరించారు. సంతపేట, ఇందిరానగర్, బీవీనగర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా సేవలను ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. నగరంలో ఇదే తరహాలో త్వరలో చేపట్టనున్నామని ప్రకటించారు.

లైసెన్సులున్న వారే బాణసంచాను విక్రయించాలి

మాట్లాడుతున్న కృష్ణకాంత్



- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు సిటీ: జిల్లాలో లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచాను విక్రయించాలని, ప్రమాదాలకు తావులేకుండా షాపులను ఏర్పాటు చేయాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతుల్లేకుండా బాణసంచాను విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన సిగ్నల్ లైట్లు, సూచిక బోర్డులు, స్టాపర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దర్యాప్తును పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను చేపట్టాలని, ఈవ్ టీజింగ్, బహిరంగ మద్యపానాన్ని అరికడితే నేరాలను నియంత్రించొచ్చన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మిస్సింగ్ కేసులకు సంబంధించి ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి వెంటనే ఛేదించాలని ఆదేశించారు. ఏఎస్పీలు సౌజన్య, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని వారిపై కొరడా

- విద్యుత్ కనెక్షన్ల తొలగింపు


కనెక్షన్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని వాణిజ్య భవనాలు ఏళ్లుగా పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో సదరు భవనాలకు విద్యుత్ కనెక్షన్ల తొలగింపు ప్రక్రియను శనివారం ప్రారంభించారు. నగరంలోని సుబేదారుపేట, పొగతోట, నవాబుపేట తదితర ప్రాంతాల్లో దాదాపు ఐదు వాణిజ్య భవనాలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను ఆ శాఖ సిబ్బంది కార్పొరేషన్ రెవెన్యూ విభాగాధికారుల సమక్షంలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ సూర్యతేజ మాట్లాడారు. దీర్ఘకాలంగా బకాయిలు ఉండటంతో వాటిని వసూలు చేసే లక్ష్యంగా ఇలాంటి చర్యలను చేపట్టామని వివరించారు.

పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలి


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని పంట కాలువలకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని రైతు సంఘ నేతలు డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షానవాజ్, గంగపట్నం రమణయ్య, నేత రామరాజు మాట్లాడారు. పంట సాగుకు సోమశిల జలాలను విడుదల చేసే ముందే జిల్లాలోని పంట కాలువలకు మరమ్మతులను చేపట్టాలని కోరారు. ప్రాజెక్టుల పనుల కోసం రూ.46 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేసిందని, అయితే జిల్లాలో నేటికీ ఎలాంటి పనులను చేపట్టలేదని చెప్పారు.

జయభారత్ ఆస్పత్రికి విరాళం


చెక్కును అందజేస్తున్న జేపీ జైన్ తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ హాస్పిటల్లో డెలివరీ రూమ్‌కు అవసరమైన టేబుల్, ఆపరేషన్ థియేటర్ లైట్ల కోసం రూ.58 వేలను భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జేపీ జైన్, సభ్యుడు మిశ్రామల్ జైన్ ప్రకటించారు. ఈ క్రమంలో చెక్కును హాస్పిటల్ డిప్యూటీ మేనేజర్లు వెంకటేష్, కృష్ణారెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జేపీ జైన్ మాట్లాడారు. జయభారత్ ఆస్పత్రికి తమ వంతు సాయాన్ని అందిస్తున్నామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఆజ్యాధివాసం


హోమాన్ని నిర్వహిస్తున్న రుత్విక్కులు


భక్తిగీతాలను ఆలపిస్తున్న గాయని



సిద్ధేశ్వరానందభారతికి ఊంజల్‌సేవ

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠపాలిత గురుదత్తాత్రేయ మఠంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారు, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా యాగశాలలో పూజలు, హోమాలను శనివారం నిర్వహించారు. మఠంలో ప్రతిష్ఠించనున్న దేవతా మూర్తులకు ఆజ్యాధివాసాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతికి ఊంజల్‌సేవను నిర్వహించారు. పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, మఠం మేనేజర్ మాచవోలు అనూరాధ, తిరుపతి శ్రీశక్తిపీఠాధీశ్వరులు రమ్యానందభారతి, ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన కమిటీ నిర్వాహకులు పత్రి గురురాజా, పాలడుగు సాయి, రాజా శ్రీనివాసరావు, శ్రీధర్, మధుసూదన్‌రావు, ఏడుకొండలు, దొంతంశెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుగ్రహభాషణ

ధర్మ సామ్రాజ్యానికి పీఠాధిపతి చక్రవర్తి అని.. గురువును దైవంగా భావించి సేవించడం శంకర సంప్రదాయంలో ఓ అంశమని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి పేర్కొన్నారు. ఈ మేరకు భక్తులకు అనుగ్రహభాషణ చేశారు.

టైమెంత బ్రో..



నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద గల క్లాక్ టవర్‌ను చూస్తే గందరగోళానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ రెండు వైపులా సమయాన్ని చూపేలా క్లాక్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఒకటి చూపే సమయానికి మరొకటి ప్రదర్శించేదానికి మధ్య తేడా కనిపిస్తోంది. దీన్ని చూసి అసలు టైమెంత బ్రో అంటూ పలువురు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

